PRGI Reg No. TGTEL/25/A0555

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :154 | పేజీలు : 8 | వెల రూ.5 | శనివారం. 20.06.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్

Published From Rangareddy

Circulated by All Districts of Telangana and Andhra Pradesh




## రక్షణశాఖ భూముల్లో మూసీ ప్రాజెక్టుకు అనుమతి..

### థాంక్స్ చెప్పిన సీఎం రేవంత్



హైదరాబాద్, ప్రభాత సూర్యుడుబాపూ ఘాట్ వద్ద గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణశాఖ అనుమతి ఇచ్చింది. 83 ఎకరాల రక్షణ శాఖ భూముల్లో మూసీ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపింది. గోల్కొండ ఆర్టిలరీ పరిధిలో రూ.533 కోట్ల విలువైన భూముల బదలాయింపునకు అనుమతి ఇచ్చింది. ఈక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, భారత ఆర్మీకి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూముల బదలాయింపు కీలక మైలురాయి అని సీఎం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

# రాహుల్ పుట్టిన రోజున రైతు డిక్లరేషన్ బొంద పెట్టిన రేవంత్ సర్కార్: హరీశ్ రావు

సిద్దిపేట, జూన్19 ప్రభాత సూర్యుడు: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినం నాడు రైతులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషం కక్కారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. శుక్రవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వరంగల్‌లో రాహుల్ గాంధీ రైతు డిక్లరేషన్ ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన జన్మదినం రోజే ఆ డిక్లరేషన్‌ను తెలంగాణ సీఎం బొందపెట్టారని హరీశ్ రావు విమర్శించారు. ధాన్యం ఏదైనా కనీస మద్దతు ధరతోపాటు బోనస్ కూడా ఇస్తామని నాడు రాహుల్ గాంధీ వరంగల్ వేదికగా ప్రకటించారని గుర్తు చేశారు. కేంద్రం చెప్పిందే కొంటాం.. ఎంత కొనమంటే అంతే కొంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణయించిన పంటలను మాత్రమే కొంటామంటే ఇక మీరెందుకు? అని అధికార కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. పేపర్ లెస్ కేబినెట్ అన్నారని.. కానీ మీది విశ్వాసం లేని కేబినెట్ అని అభివర్ణించారు. మీది విశ్వాఘాతుక ప్రభుత్వమని రేవంత్ రెడ్డి సర్కారుపై నిప్పులు చెరిగారు. పంట కొనుగోలుపై కాంగ్రెస్ సర్కార్ చేతులెత్తేసిందని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. తన బాధ్యత నుంచి తప్పించుకుంటుందంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం కొన్నా కొనకపోయినా.. అన్ని పంటలు కొన్నది కేసీఆర్ ప్రభుత్వమని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తన నిర్ణయం మార్చుకోవాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. కేంద్రం ఎంఎస్‌పి ప్రకటిస్తుంది తప్ప మక్కలూ, జొన్నలు కొనదా? అని అసహనం వ్యక్తం చేశారు. పప్పు దినుసులు, వేరుశనగ 25 శాతం మాత్రమే కేంద్రం కొనుగోలు చేస్తుందన్నారు. అంటే మిగతా పంటను రైతులు బయట అమ్ముకోవాలా? అని ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. దళారుల దయ దక్షిణ్యంపై రైతులు ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. 50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేంద్రం కొంటుందని.. మిగతా పంటను రైతులు ఏం చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటున్న రైతులకు ప్రభుత్వం భరోసా ఇస్తుందా? అని అడిగారు. తడి గుడ్డతో రైతుల గొంతును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కోస్తుందన్నారు. రైతులు జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెలగాటం ఆడుతున్నాయన్నారు. ఎకరాకు రెండు బస్తాలు మాత్రమే.. అదీ నెలకు ఒకటి చొప్పున ఇస్తారట అంటూ ఆయన ఆందోళన చెందారు. రైతులంటే మీకు ఎందుకు ఇంత చిన్నచూపు అని ప్రభుత్వంలోని మంత్రులను ఆయన ప్రశ్నించారు. యూరియా ఇచ్చే తెలివి కూడా లేదా? అని ప్రభుత్వాన్ని నిలదీశారు. మిర్చి రైతులు ఎకరాకు ఐదారు



యూరియా బస్తాలు వాడుతారని.. మరి మీరు రెండే ఇస్తే మిగతాది ఎట్లా అని ప్రశ్నించారు. కేంద్రం 30 శాతం యూరియా ధరలు పెంచిందని వివరించారు. రెండు బస్తాల ఆలోచన విరమించుకోవాలని ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు. 45 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయిల రైతు బంధు ఇస్తామన్నారని.. 90 రోజులు అయ్యిందని.. ఇప్పటికీ రైతుల ఖాతాల్లో నగదు మొత్తం పడలేదని విమర్శించారు. ఎకరాకు రూ.15 వేలు అన్నారని చెప్పారు. 2024–25 వానాకాలం పంటకు ఒక్క రూపాయి ఇవ్వలేదని.. పూర్తిగా ఎగ్గొట్టారని తెలిపారు. రైతుబంధు కింద కాంగ్రెస్ ప్రభుత్వం మొత్తం 5 పంటలకు రైతులకు రూ.29,358 కోట్లు బకాయి పడ్డిందని అన్నారు. రైతు బీమా ఆగలేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల చెప్పారని గుర్తు చేశారు. మరి ఈ ఏడాది జనవరి నుంచి నేటి వరకు రైతు బీమా ఆగిందా? లేదా చెప్పాలని మంత్రులను ఆయన బల్ల గుద్ది ప్రశ్నించారు.

## కాంగ్రెస్ సినిమాకు ఇంటర్వెల్.. ఫస్టాఫ్ అట్టర్‌ఫ్లాప్: కేటీఆర్



హైదరాబాద్, ప్రభాత సూర్యుడు తమ పాలనలో రెప్పపాటు కూడా కరెంట్ పోలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మల్కాజ్‌గిరిలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్, భాజపాను నమ్మలేదన్నారు. "కాంగ్రెస్ సినిమాకు ఇంటర్వెల్ అయిపోయింది. ఫస్టాఫ్ పాలన అట్టర్‌ఫ్లాప్. హైదరాబాద్‌లో కాంగ్రెస్ పాలనను తిట్టుకోనివాళ్లు లేరు. తులం బంగారం, రైతులకు రూ. 15 వేలు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని గ్యారెంటీ కార్డు కూడా ఇచ్చారు. ఇప్పటికే 900 రోజులు అయింది. హామీలు నెరవేరాయా? వాటి గురించి రేవంత్‌ను అడిగితే నోటికొచ్చినట్లు తిడుతున్నారు" అని కేటీఆర్ విమర్శించారు.

## తెలంగాణలో మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు

హైదరాబాద్, జూన్ 19 ప్రభాత సూర్యుడు: తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధికి కీలక ముందడుగు పడింది. గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అమలుకు కేంద్రం నుంచి అధికారిక అనుమతి లభించింది. మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌కు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్'గా అభివృద్ధి చేయడానికి వర్కింగ్ పర్మిషన్‌ను మంజూరు చేసింది. రూ.533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగానికి అనుమతిచ్చింది. ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని భూమిలో అభివృద్ధి పనులకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది.



# ఏజెన్సీ అడవుల్లో హై అలర్ట్

ప్రభాత సూర్యుడు

### మావోయిస్టుల కదలికపై నిఘా

- తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో కూంబింగ్
- తెలంగాణలోకి చొరబడేందుకు మావోల యత్నం
- తాలిపేరు ప్రాజెక్టు వద్ద భద్రత కట్టుదిట్టం
- అగ్రనేతలే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్

దట్టమైన ఏజెన్సీ అడవులు మరోసారి తుపాకుల మోతకు, బూట్ల చప్పుళ్లకు రెడీ అవుతున్నాయి. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి భారీ సంఖ్యలో మావోయిస్టులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దుల గుండా తెలంగాణలోకి చొరబడేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారన్న ఇంటెలిజెన్స్ హెచ్చరికలతో అటు ఛత్తీస్‌గఢ్, ఇటు తెలంగాణ సరిహద్దుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ చొరబాటు యత్నాలను ప్రాథమిక దశలోనే తుత్తునియలు చేసేందుకు ఇరు రాష్ట్రాల పోలీస్ యంత్రాంగాలు రంగంలోకి దిగాయి.

#### తెలంగాణలో మావోలు ఎంట్రీ

మావోయిస్టులు అడవి మార్గాల గుండా మైదాన ప్రాంతాల్లోకి రాకుండా ఉండేందుకు సరిహద్దులోని అత్యంత కీలకమైన 'తాలిపేరు' ప్రాజెక్టును స్పెషల్ ఫోర్సెస్ (ప్రత్యేక బలగాలు) తమ పూర్తి ఆధీనంలోకి తీసుకున్నాయి. ప్రాజెక్టు పరిసరాలను రెడ్ జోన్‌గా ప్రకటించి, అడవి గుండా వెళ్లే ప్రతి రహదారిని, చిన్న చిన్న కాలిబాటలను సైతం పోలీసులు పూర్తిగా బ్లాక్ చేశారు. అనుమానాస్పదంగా రాకపోకలు సాగించే ప్రతీ ఒక్కరిని జల్లెడ పడుతున్నారు. గతంలో ప్రభుత్వాలు ప్రకటించిన పునరావాస ప్యాకేజీలను తిరస్కరించి, ఇంకా అడవుల్లోనే ఉండిపోయిన అగ్రనేతలే లక్ష్యంగా ఈ ఆపరేషన్ సాగుతున్నట్లు సమాచారం.

#### మాజీల కదలికపై నిఘా

గతంలో మావోయిస్టు పార్టీలో పనిచేసి, ప్రస్తుతం లొంగిపోయి సాధారణ జీవితం గడుపుతున్న పాత సానుభూతిపరుల కదలికలను కూడా ఇంటెలిజెన్స్ నిశితంగా గమనిస్తోంది. అడవుల్లోఉన్న యాక్షన్ టీమ్స్‌కు క్షేత్రస్థాయి నుంచి రసాయనిక సామగ్రి, ఆహార సరుకులు లేదా అంతర్గత సమాచారం లాంటి లాజిస్టిక్ సపోర్ట్ ఏమైనా అందుతోందా అనే కోణంలో పోలీసులు అణువణువు తనిఖీలు చేస్తున్నారు. తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో అత్యాధునిక ఆయుధాలతో రంగంలోకి దిగిన ఇరు రాష్ట్రాల ప్రత్యేక బలగాలు సంయుక్తంగా ఏజెన్సీ గ్రామాలను చుట్టుముట్టి భారీ కూంబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. ఎప్పుడు ఏ వైపు నుంచి తుపాకీ గర్జన వినబడుతుందో తెలియని సందిగ్ధావస్థతో ప్రస్తుతం సరిహద్దు ఏజెన్సీ గ్రామాలు బిక్కుబిక్కుమంటున్నాయి.

# అన్నదాతల ఆగ్రహ జ్వాల: 'దొంతికుంట' సాక్షిగా అధికారులపై యుద్ధం!

## సుందరీకరణ ముసుగులో చెరువు దోపిడీ..
## రూ. 5 కోట్ల నిధులతో రైతుల పొలాల్లోకి మట్టి పూడ్చివేత!
## హైకోర్టు మెట్లు ఎక్కుతామని రైతుల హెచ్చరిక!







అశ్వారావుపేట జూన్ 20 ప్రభాత సూర్యుడు అధికారుల నిర్లక్ష్యం హద్దులు దాటింది.. అక్రమార్కుల దౌర్జన్యం పరాకాష్టకు చేరింది! అశ్వారావుపేట పట్టణంలోని దొంతికుంట చెరువు సుందరీకరణ పేరుతో సాగుతున్న నిలువు దోపిడీపై అన్నదాతలు చిరస్మరణీయమైన పోరాటానికి సైరన్ మోగించారు. ఎన్నో ఏళ్లుగా మొరపెట్టుకున్నా వినని ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల మొద్దునిద్రను వదిలించేందుకు, కాంట్రాక్టర్ల అక్రమాలను అడ్డుకునేందుకు రైతాంగం ఏకమైంది. "ఇక వినతులు లేవు.. కేవలం పోరాటాలే" అంటూ దొంతికుంట చెరువు కట్ట సాక్షిగా అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించేలా నేడు రైతులు యుద్ధం ప్రకటించారు.

**అక్రమాల పురిటిగడ్డ.. 2005 నాటి పాపమే పునరావృతం!**

దొంతికుంట చెరువును మింగేసేందుకు 2005లోనే అక్రమాలకు బీజం పడింది. అప్పట్లో సుందరీకరణ పేరుతో రెండు కోట్ల రూపాయలు వెచ్చించి, మినీ ట్యాంక్ బండ్ నెపంతో ఎన్నో ఎకరాల చెరువు గర్భాన్ని మాయం చేశారు. అప్పుడు వేసిన దొంతికుంట చెరువు అక్రమాల పుట్ట కొనసాగుతూనే ఉంది, ఆ పాపం చాలదన్నట్టు.. ఇప్పుడు 2026లో మళ్లీ రూ. 5 కోట్ల భారీ బడ్జెట్‌తో సుందరీకరణ, వాకింగ్ ట్రాక్ అంటూ చెరువు ఉనికిని పూర్తిగా మట్టిపెట్టేందుకు స్కెచ్ వేశారు. కనీసం హద్దులు నిర్ణయించకుండా, అసలైన ఆక్రమణదారులను తాకకుండా.. కేవలం కాంట్రాక్టర్ ప్రయోజనాల కోసం చెరువు కట్టను సుమారుగా 8 మీటర్లు వెడల్పు చేస్తూ అన్నదాతల సొంత పొలాల్లోకి అక్రమంగా మట్టిని తోలుతున్నారు. ఈ దారుణం వల్ల దాదాపు 2 ఎకరాల రైతుల సాగు భూమి కుంచించుకుపోయిందని రైతులు రగిలిపోతున్నారు.

**అక్రమ లేఅవుట్లకు పచ్చజెండా.. సాగునీటి కాల్వల, ఆక్రమణ ధ్వంసం!**

చెరువు పరివాహక ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లకు యథేచ్ఛగా ఎల్ఆర్ఎస్ (LRS) అనుమతులు మంజూరు చేసిన అధికారులు..

నేడు రైతుల నోటికాడి కూడును లాగేసుకుంటున్నారు. సాగునీరందించే కాల్వలను అక్రమంగా పూడ్చివేస్తుంటే కళ్లుండి చూడలేని గుడ్డివాళ్లలా అధికారులు వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇరిగేషన్ అధికారులు పూర్తిగా కాంట్రాక్టర్ జేబులో మనుషుల్లా మారిపోయి, వారు చెప్పినట్టు ఆడుతున్నారని,

**కట్టపై గర్జించిన అన్నదాతలు.. హైకోర్టు వేదికగా తేల్చుకుంటాం!**

అధికారుల, కాంట్రాక్టర్ల అక్రమ దందాకు వ్యతిరేకంగా ఈరోజు దొంతికుంట చెరువు కట్టపై రైతులంతా ఏకమై భారీ విలేకరుల సమావేశం నిర్వహించారు. తమ భూములను కాపాడుకోవడానికి ప్రాణాలైనా ఇస్తాం కానీ.. ఒక్క ఇంచు భూమిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని గర్జించారు. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. తక్షణమే ఈ అక్రమ పనులను నిలిపివేయకపోతే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమైన హైకోర్టును ఆశ్రయించి అధికారుల తాట తీస్తామని రైతులు హెచ్చరించారు. అన్నదాతల ఆగ్రహానికి అధికారులు తలవంచక తప్పదని, న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

---

## రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీసిన జిల్లా కలెక్టర్.

### ప్రతి రోగికి సత్వర మెరుగైన సేవలు అందించాలి.
### వైద్య సిబ్బంది బాధ్యతయుతంగా పనిచేయాలి.
### జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకర్.



ఖమ్మం జూన్ 18 ప్రభాత సూర్యుడుప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి సత్వర మెరుగైన సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. పాలేరు నియోజకవర్గంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపి రూమ్, ల్యాబ్, కాన్పుల అపరేషన్ థియేటర్, ప్రసుతి వార్డు, అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆసుపత్రిలో అందుతున్న సేవల వివరాలను ఆరా తీశారు. ఔషధ నిల్వల గదిని పరిశీలించి అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోగులకు అత్యవసర మందుల నిల్వలు, చికిత్స విధానంలో ఏలాంటి ఆలస్యం లేకుండా వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సకాలంలో అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచి, రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని అన్నారు. తిరుమలాయపాలెం ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని, ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గర్భిణీ మహిళలను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రులలో ఉన్న వనతులను వినియోగించుకుంటూ ప్రసవాల సంఖ్య పెంచాలని ఆ దిశగా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం తిరుమలాయపాలెం మండలం కేంద్రంలో నూతనంగా 26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణాలకు ఉపయోగించే కాంక్రీట్, సిమెంట్, ఐరన్ ల నాణ్యత ను పర్యవేక్షించారు. హాస్పిటల్ లో గుర్తించిన ప్రాధాన్యత పనులు త్వరితగతిన నాణ్యతతో పూర్తి చేయాలని, జిల్లా యంత్రాంగం పనుల పూర్తిలో సహకారం అందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. మండల, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డా. కృప ఉషశ్రీ, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, తిరుమలాయపాలెం మండల ఎంపిడివో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు: సీఐ వెంకటేశ్వర రావు



కరకగూడెం, జూన్ 19, ప్రభాత సూర్యుడు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో కరకగూడెం మండలంలోని ఫెర్టిలైజర్, విత్తనాల దుకాణాల్లో శుక్రవారం సీఐ వెంకటేశ్వర రావు , ఎస్ ఐ నాగేశ్వరావు లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరకగూడెం మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, లైసెన్సులు, బిల్ బుక్స్, గోడౌన్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు అమ్ముతున్న పత్తి, మిర్చి, వరి విత్తనాల బ్యాచ్ నంబర్లు, ఎక్స్‌పైరీ తేదీలు సరిచూశారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "రైతుల జీవితాలతో చెలగాటమాడే నకిలీ విత్తనాల దందాను ఉపేక్షించేది లేదు. లైసెన్స్ లేకుండా, బిల్లులు ఇవ్వకుండా నకిలీ విత్తనాలు, కల్తీ ఎరువులు అమ్మినట్లు తేలితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే బిల్లుతో సహా విత్తనాలు కొనాలని సూచించారు. నకిలీ విత్తనాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కు గానీ తెలియజేయాలని కోరారు. అలాగే షాపు యజమానులు రేట్ల పట్టికను అందరికీ కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.



## అనుమతి లేని వీఆర్ జూనియర్ .
## కళాశాలను సీజ్ చేయాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్ – ప్రభాత సూర్యుడుఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా పెద్ద అంబర్ పేట్ లో నిర్వహిస్తున్న వీఆర్ జూనియర్ కళాశాలను వెంటనే సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు గుండె శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె శివకుమార్ మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తుతో




చెలగాటమాడుతోందని ఆరోపించారు. అనుమతులు లేకుండానే కళాశాల నిర్వహించడమే కాకుండా, అక్రమంగా హాస్టల్ నడుపుతూ విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తూ, కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించిన వారిపై బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కళాశాలలోనే పుస్తకాలు, స్టేషనరీ విక్రయిస్తూ విద్యార్థులను అక్కడే కొనుగోలు చేయాలని బలవంతం చేస్తున్నారని ఆరోపించారు. లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల విద్యా హక్కులను కాలరాస్తున్నారని పేర్కొన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన విద్యార్థి సంఘ నాయకులపై యాజమాన్యం పలుకుబడితో అక్రమ కేసులు, అరెస్టులు చేయిస్తున్నారని ఆరోపించిన ఆయన, ఇలాంటి చర్యలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. కళాశాల సీజ్ అయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా ఈ అంశాన్ని తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వంశీ, నాయకులు నరేందర్, హరీష్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.




## అనుమతులు లేని పాఠశాలలపై కఠిన చర్యలు

### తనిఖీల్లో పలు ప్లే స్కూళ్ల గుర్తింపు: ఎంఈఓ జగదీష్ హెచ్చరిక

అబ్దుల్లాపూర్‌మెట్, ప్రభాత సూర్యుడు:అనుమతులు లేకుండా పాఠశాలలు, ప్లే స్కూళ్లు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ మండల విద్యాధికారి (ఎంఈఓ) జగదీష్ హెచ్చరించారు. మండల పరిధిలో ఇటీవల నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో పలు ప్రీ–ప్రైమరీ, ప్లే స్కూళ్లు సరైన అనుమతులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంస్థలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు కూడా పిల్లలను చేర్పించే ముందు పాఠశాలలకు ప్రభుత్వ అనుమతులు, గుర్తింపులు ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. తనిఖీల సందర్భంగా గుర్తించిన అనుమతులు లేని పాఠశాలల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విద్యాసంస్థలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, గుర్తింపు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాలు వెంటనే నిబంధనల మేరకు అనుమతులు పొందాలని ఎంఈఓ జగదీష్ స్పష్టం చేశారు. విద్యా ప్రమాణాల పరిరక్షణతో పాటు విద్యార్థుల ప్రయోజనాలే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# 'దేశ భవితకు దిక్సూచి రాహుల్ గాంధీ'

**భావి భారత ప్రధానిగా చూడడమే ప్రజల ఆకాంక్ష మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు.**



ఖమ్మం జూన్ 19 ప్రభాత సూర్యుడు కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ భవితకు దిక్సూచి అని, ఆయనను భావి భారత ప్రధానిగా చూడడమే యావత్ దేశ ప్రజల ఆకాంక్ష అని తెలంగాణ రెవెన్యూ , గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ 56వ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. తుంబూరు దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సమగ్రత, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న రాహుల్ గాంధీ త్వరలోనే ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజాపక్షపాతి అయిన ఆయన నాయకత్వంలో దేశం మరింత ప్రగతి పథంలో పయనిస్తుందని ఆకాంక్షించారు. ?ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఏదులాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, పార్టీ ముఖ్య నాయకులు మద్ది వీరారెడ్డి, వెంకట్‌కృష్ణ, ఉమ్మినేని కృష్ణ, షేక్ ఇమామ్, రంజిత్ నాయక్, రవి, పీఎస్ఆర్ సోషల్ మీడియా వారియర్స్ ఆరెంపుల బద్రిసాయి, బొడ్డు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా 2,000 అరటిపండ్ల పంపిణీ







2,000 అరటిపండ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు.



శామీర్‌పేట్ జూన్ 19 ప్రభాత సూర్యుడు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట్ డివిజన్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సుమారు 2,000 అరటిపండ్లను విద్యార్థులకు పంపిణీ చేశారు. శామీర్‌పేట్, తూముకుంట దేవరయాంజాల్, బొమ్మరాసి పేట్, బాబాగూడ, ఉప్పరపల్లి, పోతాయిపల్లి, సింగాయిపల్లి, మందాయిపల్లి, అంతాయిపల్లి గ్రామాల్లోని 4 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 9 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులకు పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో అరటిపండ్ల పంపిణీ చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా భీమిడి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవకు అంకితభావంతో పనిచేస్తున్న రాహుల్ గాంధీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. చిన్నారుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలకు కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో కె. మీనా కుమారి, ఎస్. మధుసూదన్ రెడ్డి, వై. శంకర్ గౌడ్, వి. అశోక్, బి. కిషోర్ యాదవ్, ఏ. నాగేశ్ యాదవ్, ఎస్. ఇంద్ర, డి. సాయిబాబా, టి. శంకర్ గౌడ్, పి. లక్ష్మీనారాయణ, వి. మురళి గౌడ్ తదితర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పలు కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్




సింగరేణి జూన్ 19 ప్రభాత సూర్యుడు సింగరేణి మండలంలో వైరా మాజీ శాసన సభ్యులు లావుడియా రాములు నాయక్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. భాగ్యనగర్ తండా గ్రామానికి చెందిన మండల నాయకులు భూక్య రాంకిషోర్ గారి అన్న భూక్య కిషన్ 11వ వార్డు మెంబర్ కుమారుడుకి ఇటీవల కారు ప్రమాదంలో గాయాలవ్వడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని తాటి బెల్లం టి స్టాల్ ను సందర్శించి ప్రోప్రేటర్ హట్కర్ శ్రీను అభినందించారు. అనంతరం ఆల్య తండా గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు దారవత్ రాంజీ గారి తండ్రి హరిసింగ్ గురువారం మరణించడంతో వారి కుటుంబ సభ్యులు పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. గుట్టకింద గుంపు మాజీ ఉపసర్పంచ్ గౌస్ పాషా ఉషా తండ్రి షేక్ సైదా అనారోగ్యంతో ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వెంట మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ఉన్నం వీరేందర్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మండల నాయకులు అజ్మీర వీరన్న, వాంకుడొత్ నరేష్, ఏన్కూరు మండల మాజీ అధ్యక్షుడు బాణోత్ సురేష్, నాయకులు గుగులోత్ హారు, బాణోత్ కోటి, వాంకుడొత్ కరణ్ సింగ్, వాంకుడొత్ సతీష్, గుగులోత్ సురేష్, జాల సాంబ, 8వ వార్డు సభ్యులు గుగులోత్ నాగేశ్వరరావు, దస్తగిరి, మన్సూర్, ఖలీల్, సర్వర్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రుల 'కలగూర' అవినీతి.. తుమ్మల, పొంగులేటిలపై బీఆర్ఎస్ గర్జన!

## 1/70 చట్టం ఉల్లంఘించి తుమ్మల భూముల కొనుగోళ్లు

## రాఘవ' కోసమే అమృత్ టెండర్ల రూల్స్ మార్పు.. పొంగులేటిపై ధ్వజం!

## అశ్వారావుపేట బీఆర్ఎస్ సమావేశంలో కాంగ్రెస్ 'దోపిడీ' చిట్టా విడుదల!





అశ్వారావుపేట జూన్ 20( ప్రభాత సూర్యుడు )రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాసేవను గాలికొదిలేసి, మంత్రులు కేవలం 'కలెక్షన్ల' వేటలోనే పడ్డారని బీఆర్ఎస్ ముఖ్య నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఒకరిని మించి ఒకరు పోటీపడి అక్రమ మార్గాల్లో వందల కోట్లు గడిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశం స్థానికంగా జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ మంత్రుల అవినీతి చిట్టాను ఆధారాలతో సహా బయటపెట్టారు.

**షెడ్యూల్డ్ ఏరియాలో మంత్రి తుమ్మల భూముల మతలబు ఏంటి..**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గత ఎన్నికల అఫిడవిట్లలో చూపిన భూముల వివరాలపై బీఆర్ఎస్ నేతలు పలు సూటి ప్రశ్నలు సంధించారు 2014 ఎన్నికల అఫిడవిట్‌లో దమ్మపేట మండలం నాగూపల్లి గ్రామంలో తనకు 26 ఎకరాల 9 గుంటల భూమి ఉందని చూపిన తుమ్మల, 2023 ఎన్నికల నాటికి అది 36 ఎకరాల 11 గుంటలకు ఎలా పెరిగిందని నిలదీశారు. గిరిజన ప్రాంతమైన షెడ్యూల్డ్ ఏరియా (1/70 చట్టం) పరిధిలోకి వచ్చే ఈ 10 ఎకరాల భూమిని గిరిజనేతరుడైన మంత్రికి ఎలా రిజిస్ట్రేషన్ చేశారో సమాధానం చెప్పాలన్నారు.ఈ భూ కుంభకోణంపై గత 40 రోజులుగా తాము ప్రశ్నిస్తున్నా మంత్రి నోరు మెదపకపోవడం వెనుక మర్మమేంటని ప్రశ్నించారు.'అమృత్' టెండర్లలో పొంగులేటి హస్తం.. బుగ్గపాడులో భూముల దోపిడీ!మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన అధికార బలంతో నిబంధనలు మార్చి మరీ రూ. 1,906 కోట్ల 'అమృత్ 2.0' ప్రాజెక్ట్ టెండర్లను తన స్వంత సంస్థ 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్'కు కట్టబెట్టుకున్నారని మండిపడ్డారు.అటు బుగ్గపాడు ఫుడ్ ప్రాసెసింగ్ జోన్‌లో ఎకరం రూ. 40.75 లక్షలు పలికే ప్రభుత్వ భూమిని, 'దీపక్ నెక్స్ట్ జెన్' అనే ఆంధ్ర కంపెనీకి కేవలం రూ. 20 లక్షలకే (70 ఎకరాలు) క్యాబినెట్ ఆమోదంతో అప్పనంగా రాసిచ్చారని ఆరోపించారు. దీనితో పాటు సీతారామ ప్రాజెక్ట్ మట్టి, గ్రావెల్‌ను ఇష్టారాజ్యంగా తరలిస్తూ మైనింగ్, ఇరిగేషన్ దోపిడీకి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. మొక్కజొన్న రైతులను ముంచిన వ్యవసాయ శాఖ ఖమ్మం జిల్లాలో అత్యధికంగా పండే మొక్కజొన్న రైతులను కొనుగోలు కేంద్రాలు సకాలంలో తెరవకుండా ప్రభుత్వం ముంచిందని విమర్శించారు. మార్చిలో పంట చేతికొస్తే, ఏప్రిల్ 13న కేంద్రానికి లేఖ రాయడం మంత్రి తుమ్మల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని, దీనివల్ల రైతులు దళారుల చేతిలో మోసపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 23న అశ్వారావుపేటకు 'హరీష్ రావు' రాకపార్టీ బలోపేతమే ధ్యేయంగా బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్ మరియు 'సర్' (Special Intensive Revision) ప్రోగ్రాంపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేసేందుకు ఈ నెల 23వ తేదీ (మంగళవారం) మధ్యాహ్నం 2 గంటలకు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు అశ్వారావుపేటకు రానున్నట్లు నాయకులు వెల్లడించారు. నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మండల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ ఆర్ బి జిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ డ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో.

**పరిపూర్ణ జీవితానికి యోగా ఆసరా కార్యక్రమం..**




ఖమ్మం జూన్ 19 ప్రభాత సూర్యుడు ఆధునిక జీవనశైలిలో వచ్చిన మార్పులతో అనేక మానసిక ఒత్తిడులను ఎదుర్కొంటున్న మానవాళికి పరిపూర్ణమైన జీవితాన్ని గడిపేందుకు యోగా ఆసరా గా నిలుస్తుందని యోగా మాస్టర్ కోదండరాం అన్నారు శుక్రవారం నాడు ఎస్ఆర్ బిజి ఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎన్.సిసి,ఎన్.ఎస్.ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రానున్న ఆదివారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు అధ్యాపకులకు యోగా ముద్రలను, ప్రాధాన్యతల పట్ల అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.బి.వెంకన్న,ఐ.క్యూ.ఏసి కోఆర్డినేటర్ డా.ఎం.సునంద ,ఎన్.ఎస్.ఎస్ పీఓలు డా.ఎం.పిచ్చయ్య,డా.ధర్మయ్య, అధ్యాపకులు డా.శ్రీనివాన్,బంగారి,కె.రవికుమార్ ,డా.వి.నర్వే శ్వరావు,డా.శ్రీనివాసశరీన్,డా.గౌసియా విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# సంగారెడ్డి: దేశ భద్రత రాహుల్ గాంధీ కుటుంబంతోనే సాధ్యం:

జగ్గారెడ్డి జూన్(19) ప్రభాత సూర్యుడు: దేశభద్రత రాహుల్ గాంధీ కుటుంబంతోనే సాధ్యమైతుందని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి




అన్నారు. సంగారెడ్డి పట్టణంలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ 56 వ జన్మదిన వేడుకలను శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు! రాహుల్ గాంధీ కుటుంబం దేశ ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేసిందని తెలిపారు. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు ఉమ్మడిమెదక్ జిల్లాను పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చేశారని గుర్తు చేశారు.

# కౌకూర్‌లో విషాదం.. ప్రమాదకర జంక్షన్‌లో మరో ప్రాణం బలి



కౌకూర్ జూన్ 19 ప్రభాత సూర్యుడు కౌకూర్ ఫార్చ్యూన్ అవెన్యూ కాలనీకి చెందిన వరకాల స్వామి 64 రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. తన కుమార్తెను యాప్రాల్‌లో దింపి తిరిగి ఇంటికి వస్తుండగా బ్రైట్ వ్యూ సమీపంలో ఫార్చ్యూన్ అవెన్యూ కాలనీ వైపు మలుపు తిరుగుతున్న సమయంలో అతివేగంగా వచ్చిన బుల్లెట్ బైక్ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ ఘటనతో స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బ్రైట్ వ్యూ--ఫార్చ్యూన్ అవెన్యూ జంక్షన్ ప్రమాదాలకు కేంద్రంగా మారిందని, గత నాలుగేళ్లలో సుమారు 14 మంది ఇదే ప్రాంతంలో రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు, అనధికారిక ఇంటర్నెట్ పోల్స్, వాహనాల అధిక వేగమే ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు.ప్రమాద స్థలాన్ని మల్కాజిగిరి జోన్ జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, సామాజిక కార్యకర్త తుడిమెల్ల మల్లికార్జున్ ఆ ప్రాంతంలో తరచుగా జరుగుతున్న ప్రమాదాలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.పరిశీలనలో ట్రాఫిక్ ఏసీపీ సుబ్బయ్య, జవహర్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్, రోడ్ సేఫ్టీ ఎస్ఐ జగన్, ఎంఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారులు పాల్గొన్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలపై చర్చించారు.రహదారి మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు లేదా స్థానచలనం, స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, ఫార్చ్యూన్ అవెన్యూ, గ్రీన్‌వుడ్స్, ఆర్క్ కాలనీలకు ప్రత్యామ్నాయ మార్గాల కల్పన, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ అధికారులను ఆదేశించారు.అలాగే భరత్‌పేట్ సర్కిల్ నుంచి కార్గిల్ గేట్ హనుమాన్ ఆలయం వరకు ఉన్న అనధికారిక విద్యుత్, ఇంటర్నెట్ పోల్స్ తొలగించి, వీధి దీపాల ఏర్పాటుతో రహదారి భద్రతను మెరుగుపరచాలని ప్రతిపాదనలు సమర్పించారు.భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని తుడిమెల్ల మల్లికార్జున్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు శ్రీనివాస్ యాదవ్, బాల్ రెడ్డి, శివరాజ్, అల్లి మల్లేష్, అల్లి పండు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లి జూన్ 19 ప్రభాత సూర్యుడు భారత జాతీయ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమ దుర్గా భవన్‌లో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత సాధికారత కోసం ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని, రాహుల్ గాంధీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ ప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజాసేవ పట్ల ఆయన నిబద్ధత యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



## ప్రభాస్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ సవాల్ ఈ పాత్రతోనే!



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, వైవిధ్యభరితమైన చిత్రాల దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం -ఫౌజి-.రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, వైవిధ్యభరితమైన చిత్రాల దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం -ఫౌజి-. ఈ సినిమా షూటింగ్ ఏళ్ల తరబడి సాగుతుండటం, విడుదల తేదీ విషయంలో ఇప్పటివరకు సరైన స్పష్టత లేకపోవడంతో ప్రభాస్ అభిమానులు మేకర్స్‌పై చాలా సీరియస్‌గా ఉన్నారు. అయినా ఇంకా రిలీజ్ తేదీపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇంతలోనే డార్లింగ్ తన కాల్షీట్లను పూర్తిగా సందీప్ వంగా -స్పిరిట్- కోసం కేటాయించారని ప్రచారమైంది. ఈ సినిమా కొత్త షెడ్యూల్ షూటింగ్ కోసం వంగా తన ఏర్పాట్లలో తాను ఉన్నాడు. అయితే ఇంతలోనే ప్రభాస్ ఒక కొత్త నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. అతడు కొన్ని నెలల పాటు తన ప్రాజెక్ట్‌ల ప్రాధాన్యతలను మార్చుకున్నట్లు తెలుస్తోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ని -స్పిరిట్- కొత్త షెడ్యూల్ ను ప్రారంభించడానికి ముందే -ఫౌజి- చిత్రాన్ని పూర్తిగా పూర్తి చేయాలని నిర్ణయించుకున్నాడట. అందుకోసం దాదాపు మూడు నెలల సమయాన్ని పూర్తిగా -ఫౌజి- షూటింగ్‌కే కేటాయించనున్నారు. ఇప్పటికే ఈ ఏడాది జనవరి నుండి మార్చి మధ్య జరిగిన షెడ్యూల్స్‌లోనే ప్రభాస్ దాదాపు 50 శాతం షూటింగ్‌ను పూర్తి చేసేశారు. మిగిలిన భాగాన్ని కూడా ఒకే పట్టున పూర్తి చేసి... అనుకున్నట్లుగా డిసెంబర్ విడుదలకు సినిమాను సిద్ధం చేయాలనేది ప్రభాస్ ప్లాన్. 1945 కాలం నాటి బ్రిటీష్ ఇండియన్ ఆర్మీ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ డ్రామాలో ప్రభాస్ ఒక సైనికుడి పాత్రలో కనిపించనున్నారు. కేవలం లార్జర్ దేన్ లైఫ్ మాస్ యాక్షన్ ఎలిమెంట్స్‌కే పరిమితం కాకుండా... ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత సంక్లిష్టమైన.. విభిన్నమైన షేడ్స్ ఉన్న పాత్రగా దీనిని హను రాఘవపూడి డిజైన్ చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం ఒక సైనికుడి జీవితంలో ఎదురైన వివిధ దశలు, ఎమోషనల్ గ్లిచెస్, వ్యక్తిగా అంతర్గత పరిణామ క్రమాన్ని ఈ కథలో చూపించబోతున్నారు. శారీరక శ్రమతో పాటు ఎంతో మానసిక పరిపక్వతతో కూడిన నటనను ఈ పాత్రలో ప్రదర్శించాల్సి ఉంటుంది. ప్రభాస్ కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్న పాత్ర ఇదని చెబుతున్నారు. ఇటీవల వచ్చిన దేవర, పెద్ది వంటి భారీ చిత్రాలలో లవ్ ట్రాక్స్ కథకు సంబంధం లేకుండా బలవంతంగా ఇరికించినట్లు ఉన్నాయనే విమర్శలు వచ్చాయి. అయితే హను రాఘవపూడి -సీతా రామం- తరహాలోనే -ఫౌజి-లో కూడా కథలో లీనమైపోయే ఒక అద్భుతమైన, మనసుకు హత్తుకునే ప్రేమకథను చూపించబోతున్నారట. ఈ సినిమాలో ప్రేమ అనేది కేవలం కమర్షియల్ ఎలిమెంట్ లాగా కాకుండా కథలో అంతర్భాగంగా సాగుతుంది.

## ఆటలంటే పడి చచ్చే టాప్-10 స్టార్లు.. ఫుట్‌బాల్‌పైనా అమితాసక్తి!

సినిమాలు, క్రీడలు అనేవి భారతదేశంలో అత్యంత ఆదరణ కలిగిన రెండు రంగాలు. వెండితెరపై ప్రేక్షకులను అలరించే సినీ సెలబ్రిటీలు చాలామంది.. నిజ జీవితంలో క్రీడలను అమితంగా ప్రేమిస్తుంటారు.సినిమాలు, క్రీడలు అనేవి భారతదేశంలో అత్యంత ఆదరణ కలిగిన రెండు రంగాలు. వెండితెరపై ప్రేక్షకులను అలరించే సినీ సెలబ్రిటీలు చాలామంది.. నిజ జీవితంలో క్రీడలను అమితంగా ప్రేమిస్తుంటారు. కేవలం వినోదం కోసమే కాకుండా.. పలు క్రీడలలో పెట్టుబడులు పెడుతూ, వాటికి బ్రాండ్ అంబాసిడర్లుగా వ్యవహరిస్తూ క్రీడా రంగాన్ని ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. తాజాగా జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్ ఫుట్ బాల్ మ్యాచుల నేపథ్యంలో ఆటలపై అమితాసక్తిని కనబరుస్తూ క్రీడలను ప్రోత్సహిస్తున్న భారతీయ టాప్ స్టార్లపై ప్రత్యేక కథనం... ఈ జాబితాలో బాలీవుడ్ బిగ్ బి



అమితాబ్ బచ్చన్ అందరికంటే ముందు వరుసలో ఉంటారు. 70 ప్లస్ వయసులోనూ ఆయన ఇప్పటికీ నవయువకుడిలా ప్రతి క్రీడను ఎంతో ఆసక్తిగా ఫాలో చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్ ఫుట్ బాల్ మ్యాచుల్ని నిరంతరం వీక్షిస్తున్న అమితాబ్, ఐపిఎల్ టోర్నీని కూడా అస్సలు వదలకుండా చూసే పెద్ద అభిమాని. క్రికెట్, కబడ్డీ, ఫుట్ బాల్, మహిళా క్రికెట్, టెన్నిస్, షటిల్.. ఆట ఏదైనా సరే అమితాబ్ కల్పించే అవేర్ నెస్ (అవగాహన) వేరే లెవల్‌లో ఉంటుంది. సినిమాలతో పాటు ఆటలను కూడా ఫాలో అవ్వడానికి తనకు రోజుకు 24 గంటలు సరిపోవడం లేదని, 36 గంటలు కావాలని ఆయన అడుగుతుంటారంటే క్రీడలపై ఆయనకు ఎంతటి ప్రేమ ఉందో అర్థం చేసుకోవచ్చు. బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ కేవలం ఐపిఎల్ ఫ్రాంఛైజీ కోల్‌కతా నైట్ రైడర్స్ ఓనర్ మాత్రమే కాదు.. ఆట అంటే పడిచచ్చే వీరాభిమాని. క్రీడలపై ఉన్న ఆ ఇష్టమే ఆయనను క్రికెట్ ఫ్రాంఛైజీ ఓనర్ గా అంతలా రాణించేలా చేసింది. క్రికెట్ మాత్రమే కాకుండా ఇంకా చాలా క్రీడలపై షారూఖ్ కి విపరీతమైన ఆసక్తి ఉంది. అందుకోసమే ఆయన క్రీడా రంగంలో భారీగా పెట్టుబడులు కూడా పెడుతున్నారు. షారూఖ్ ఖాన్‌తో పాటు బాలీవుడ్‌లో క్రికెట్, ఫుట్ బాల్ ఆటల్ని ప్రేమించే స్టార్లు చాలామందే ఉన్నారు. ముఖ్యంగా రణబీర్ కపూర్, జాన్ అబ్రహం, అభిషేక్ బచ్చన్ వంటి హిందీ తారలు ఫుట్ బాల్ ఆటపై విపరీతమైన ఆసక్తిని కనబరుస్తూ.. ఇండియన్ సూపర్ లీగ్ (xూా) వంటి టోర్నమెంట్లలో ఫుట్ బాల్ జట్లను కొనుగోలు చేసి ఆ క్రీడను మరింత ముందుకు నడిపిస్తున్నారు. ఇక టాలీవుడ్ విషయానికి వస్తే.. విక్టరీ వెంకటేష్ క్రికెట్ కి ఎంతటి వీర ప్రేమికుడో అందరికీ తెలిసిందే. ఐపిఎల్ మ్యాచ్ లు అయినా, వరల్డ్ కప్ మ్యాచ్ లు అయినా ఆయన అస్సలు వదిలిపెట్టరు. కేవలం టీవీలకే పరిమితం కాకుండా నేరుగా లైవ్ గా గ్రౌండ్ కి వెళ్లి మరీ భారత జట్టును ఉత్సాహపరుస్తుంటారు.

## మహేష్ రాజమౌళి.. నెక్ట్స్ టెన్షన్ గట్టిగానే..



కానీ తన నెక్ట్స్ భారీ విజన్ కు సరిగ్గా సెట్ అయ్యే హీరోను ఎంచుకోవడమే ఆయన ముందున్న ఏకైక టాస్క్. ప్రస్తుతానికి ఆ ఆలోచన కూడా లేకుండా వారణాసి మీదే ఫోకస్ పెట్టారు.మహేష్ బాబు, రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న వారణాసి సినిమాపై అంచనాలు మామూలు స్థాయిలో లేవు. దాదాపు 1400 కోట్ల బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ టైమ్ ట్రావెల్, మాయన్ నాగరికత లాంటి సరికొత్త కాన్సెప్ట్ లతో రాబోతోంది. ఇందులో శివ భక్తుడు రుద్రగా మహేష్, కుంభ పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద 3000 నుంచి 4000 కోట్ల బిజినెస్ చేసే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాల్లో గట్టిగా టాక్ నడుస్తోంది. 2027 ఏప్రిల్ 7న రిలీజ్ కానున్న ఈ సినిమా కోసం హాలీవుడ్ స్థాయిలో భారీ ప్రమోషన్స్ ప్లాన్ చేస్తున్నారు. వారణాసి గనక ఇంటర్నేషనల్ మార్కెట్ లో క్లిక్ అయితే ఇక కలెక్షన్ల లెక్కలు ఎవరి ఊహకు కూడా అందవు. అయితే అసలైన టెన్షన్ అంతా ఈ సినిమా రిలీజ్ పూర్తయిన తర్వాతే మొదలవుతుంది. ఇంతటి భారీ గ్లోబల్ సక్సెస్ చూశాక మహేష్, రాజమౌళి ఇద్దరిదీ ఒకే రకమైన పరిస్థితి అవుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. వారణాసి తర్వాత వీరు తీయబోయే నెక్ట్స్ ప్రాజెక్ట్స్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ ఫోకస్ ఉంటుంది. అందుకే ఆ తర్వాత ఎవరితో పని చేయాలి అనే విషయంలో ఈ ఇద్దరి ముందు ఒక అతిపెద్ద సవాల్ నిలబడబోతోంది. ముందుగా డైరెక్టర్ రాజమౌళి వరకు చూసుకుంటే ఆయనకు హీరోల పరంగా పెద్దగా ఇబ్బంది ఉండకపోవచ్చు. ఆయన దగ్గర పక్కా కథ లేకపోయినా సరే, కేవలం పిలిచి అడిగితే వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి దేశంలోని టాప్ స్టార్ హీరోలంతా క్యూలో రెడీగా ఉంటారు. కానీ తన నెక్ట్స్ భారీ విజన్ కు సరిగ్గా సెట్ అయ్యే హీరోను ఎంచుకోవడమే ఆయన ముందున్న ఏకైక టాస్క్. ప్రస్తుతానికి ఆ ఆలోచన కూడా లేకుండా వారణాసి మీదే ఫోకస్ పెట్టారు. కానీ హీరో మహేష్ బాబు పరిస్థితి మాత్రం ఇందుకు పూర్తిగా డిఫరెంట్ గా ఉండబోతోంది. వారణాసి లాంటి పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ తర్వాత ఆయనకు సరైన డైరెక్టర్ దొరకడం అంటే అంత ఈజీ టాస్క్ కాదు. రాజమౌళి సెట్ చేసిన ఆ భారీ స్కేల్ ను, కొత్తగా వచ్చిన ఆ గ్లోబల్ ఇమేజ్ ను మ్యాచ్ చేయగల దర్శకులు మన ఇండియాలో చాలా తక్కువ మంది ఉన్నారు. ప్రస్తుతం మహేష్ నెక్ట్స్ సినిమా ఫలానా డైరెక్టర్లతో ఉంటుందనే రూమర్స్ వస్తున్నా అవేవీ అంత తేలికగా సెట్ కావు. గతంలో లాగా కేవలం ఒక చిన్న స్టోరీ లైన్ విని మహేష్ బాబు ఎవరికీ అంత త్వరగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే పరిస్థితి ఇప్పుడు లేదు. ఏ డైరెక్టర్ అయినా సరే పక్కాగా ఫుల్ స్క్రిప్ట్ తో వస్తే తప్ప కొత్త ప్రాజెక్ట్ ఓకే అయ్యే ఛాన్స్ అస్సలు లేదు. కాబట్టి ఇప్పుడు వినిపిస్తున్న టాక్ అంతా కేవలం గాలివాటమే అని చెప్పొచ్చు. ఏదేమైనా వారణాసి మ్యాజిక్ తర్వాత ఈ ఇద్దరూ తమ తదుపరి సినిమాలతో ఎలా అడుగులు వేస్తారో చూడాలి.

## పాన్ ఇండియా లెవెల్లో ఐకాన్ స్టార్ 'ఆర్య'.. వర్కవుట్ అవుతుందా!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కి యువతలో మంచి ఫాలోయింగ్ ని తెచ్చి పెట్టేలా చేసిన సినిమాల్లో తన కెరీర్ ఆరంభంలో వచ్చిన సెన్సేషనల్ హిట్ సినిమా ఆర్య కూడా ఒకటి. దర్శకుడు సుకుమార్ మొదటి సినిమాగా వచ్చిన ఈ చిత్రం కొత్త ఒరవడిని సృష్టించింది. ఇక ఈ సినిమా గ్రాండ్ పాన్ ఇండియా రిలీజ్ కి సిద్ధం అవుతుండడం విశేషం. ఇది వరకు చాలా సినిమాలు కేవలం రీజనల్ గా మాత్రమే విడుదల అయ్యాయి.బాహుబలి ది ఎపిక్ మినహా పాన్ ఇండియా లెవెల్లో ఏ సినిమా వచ్చింది లేదు. కానీ ఇపుడు ఆర్య సినిమా తెలుగు, మలయాళం అలాగే హిందీలో విడుదల అయ్యేందుకు సిద్ధం అవుతున్నట్టు తెలుస్తోంది. దేవిశ్రీప్రసాద్ ఇచ్చిన పాటలు అప్పట్లోనే పాన్ ఇండియా రీచ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. సో ఈ సారి రెస్పాన్స్ ఎలా ఉంటుందో చూడాల్సిందే. ఇంకా దీనిపై రిలీజ్ డేట్ బయటకి రావాల్సి ఉంది.

## స్పిరిట్ : అక్కడి మార్కెట్ పై సందీప్ రెడ్డి ఫోకస్..!



ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమా టాలీవుడ్ పరిధిని దాటి 'పాన్ వరల్డ్' స్కేల్‌లో ప్లాన్ అవుతోంది. ఈ చిత్రాన్ని భారతీయ భాషలతో పాటు మాండరిన్, జపనీస్, కొరియన్ వంటి మొత్తం ఎనిమిది భాషల్లో ఒకేసారి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. మన సినిమాలు ఇక్కడ హిట్ అయ్యాక విదేశాల్లో డబ్ చేయడం కాకుండా, ముందే గ్లోబల్ రిలీజ్ టార్గెట్ పెట్టుకోవడం ఒక డేరింగ్ స్టెప్.కొరియా, జపాన్ ప్రేక్షకులకు డార్క్ కంటెంట్, రా యాక్షన్ సినిమాలు అంటే చాలా ఇష్టం. సందీప్ వంగా అగ్రెసివ్ టేకింగ్ కూడా అదే స్టైల్‌లో ఉంటుంది. ఇందులో ప్రభాస్ సస్పెండ్ అయిన పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా, ఇంటర్నేషనల్ క్రైమ్ సిండికేట్‌ను ఒంటరిగా ఎదుర్కొనే పాత్రలో కనిపిస్తున్నారు. కొరియన్ మూవీ లవర్స్ ఆశించే ఎమోషన్, బ్లడ్ షెడ్ ఈ డార్క్ యాక్షన్ థ్రిల్లర్‌లో పుష్కలంగా ఉండటంతో ఈ కాన్సెప్ట్ అక్కడ బాగా కనెక్ట్ అవుతుందని మేకర్స్ నమ్ముతున్నారు.టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా, వివేక్ ఒబెరాయ్ పవర్‌ఫుల్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ అంతర్జాతీయ ప్రయోగం గనక పర్ఫెక్ట్‌గా క్లిక్ అయితే, ఈస్ట్ ఏషియన్ దేశాల నుండి వచ్చే కలెక్షన్లతో టాలీవుడ్ బాక్సాఫీస్ లెక్కలు, బిజినెస్ రేంజ్ పూర్తిగా మారిపోవడం ఖాయం.

## అక్క లక్కీ హీరోయిన్.. మరి తమ్ముడు?



ఇప్పుడు దర్శకుడు శంకర్ కుటుంబంలో అలాంటి పరిస్థితే కనిపిస్తోంది. ఇప్పటికే చిన్న కూతురు అదితి శంకర్ హీరోయిన్ గా మంచి గుర్తింపు తెచ్చుకుని లక్కీ బ్యూటీగా పేరు సంపాదించగా.. ఇప్పుడు కొడుకు అర్జిత్ శంకర్ హీరోగా ఎంట్రీ ఇవ్వడంతో ఆసక్తికర చర్చ మొదలైంది. సినీ ఇండస్ట్రీలో స్టార్ హీరోలు, దర్శకుల వారసులు ఎంట్రీ ఇవ్వడం కొత్త విషయం కాదు. అయితే ఒకే ఫ్యామిలీ నుంచి వచ్చిన వారసుల్లో ఒకరు సక్సెస్ అయితే, మిగిలిన వారిపై అంచనాలు పెరగడం సహజం. ఇప్పుడు దర్శకుడు శంకర్ కుటుంబంలో అలాంటి పరిస్థితే కనిపిస్తోంది. ఇప్పటికే చిన్న కూతురు అదితి శంకర్ హీరోయిన్ గా మంచి గుర్తింపు తెచ్చుకుని లక్కీ బ్యూటీగా పేరు సంపాదించగా.. ఇప్పుడు కొడుకు అర్జిత్ శంకర్ హీరోగా ఎంట్రీ ఇవ్వడంతో ఆసక్తికర చర్చ మొదలైంది. అయితే శంకర్ పెద్ద కూతురు ఐశ్వర్య శంకర్ మెడిసిన్ పూర్తి చేసి సినిమాలకు దూరంగా ఉన్నారు. కానీ చిన్న కూతురు అదితి శంకర్ మాత్రం తన కెరీర్ ను పూర్తిగా సినిమాల వైపే తీసుకొచ్చారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత సినిమాలపై ఉన్న ఆసక్తితో హీరోయిన్ గా పరిచయమయ్యారు. కార్తీ హీరోగా తెరకెక్కిన విరుమాన్ చిత్రంతో హీరోయిన్ గా పరిచయమైన అదితి, తొలి సినిమాతోనే ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆ సినిమా కమర్షియల్ గా మంచి విజయం సాధించడంతో ఆమెకు వరుస అవకాశాలు వచ్చాయి. ఆ తర్వాత శివకార్తికేయన్ హీరోగా నటించిన మావీరన్ లో కనిపించారు. ఆ చిత్రం కూడా బాక్సాఫీస్ వద్ద మంచి రిజల్ట్ సాధించింది. యాక్టింగ్ తోపాటు సింగర్ గా కూడా ఆమె తన టాలెంట్ ను చాటుకున్నారు. కొన్ని చిత్రాల్లో పాటలు పాడి ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం తమిళంలో పలు క్రేజీ ప్రాజెక్టుల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇటీవల తెలుగులో భైరవం చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి ఇక్కడ కూడా గుర్తింపు పొందారు. ఇక ఇప్పుడు అదే కుటుంబం నుంచి మరో వారసుడు సినీ రంగంలోకి అడుగు పెడుతున్నారు. అర్జిత్ శంకర్ అమెరికాలో ఫిల్మ్ మేకింగ్ లో ట్రైనింగ్ తీసుకున్నారు. చాలా కాలంగా ఆయన సినీ ఎంట్రీపై ప్రచారం జరుగుతూనే ఉంది. అయితే తాజాగా ఆ ప్రచారానికి చెక్ పెట్టి హీరోగా తన తొలి సినిమాను అధికారికంగా ప్రారంభించారు. అర్జిత్ నటిస్తున్న తొలి చిత్రానికి లవర్ బాయ్ అనే టైటిల్ ను ఫిక్స్ చేశారు. ఆ సినిమాకు అట్లీ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసిన అశోక్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తుండటం సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. యూత్ ఫుల్ యాక్షన్ రొమాంటిక్ ఎంటర్టైనర్ గా రూపొందుతున్న ఆ సినిమా స్టార్ట్ కావడంతో ఇప్పుడు ఒకే చర్చ వినిపిస్తోంది. అక్క అదితి శంకర్ కెరీర్ ప్రారంభంలోనే హిట్లు అందుకుని లక్కీ హీరోయిన్ గా పేరు తెచ్చుకున్నారు. మరి తమ్ముడు అర్జిత్ కూడా అదే రేంజ్ లో హిట్స్ అందుకుంటారా? అనే ప్రశ్న ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే ఫ్యామిలీ బ్యాక్ గ్రౌండ్ అవకాశాలు తెచ్చిపెట్టొచ్చు.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555